
సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం। 10। జూన్। 2025



సోమశిలలో 40.23 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో సోమవారం సాయంత్రానికి 40.23 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 4370 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.99,260
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.8,990
మూడు శాతం జీఎస్టీతో	రూ.9,260
నవర (8 గ్రాములు)	రూ.74,080

వాతావరణం

గరిష్టం/కనిష్టం 39.3 /30.6

జిల్లాలో ఉష్ణోగ్రతలు మంగళవారం మోస్తరుగా ఉంటాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 45 శాతంగా సోమవారం నమోదైంది.

న్యూస్‌రీల్

కాకాణి బెయిల్ పిటిషన్‌పై విచారణ రేపు

నెల్లూరు (లీగల్): నెల్లూరు ఐదో అదనపు (ప్రత్యేక ఎస్సీ, ఎస్టీ) కోర్టులో బెయిల్ పిటిషన్‌ను మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి దాఖలు చేశారు. ఆయన తరఫున సీనియర్ న్యాయవాదులు రామిరెడ్డి రోజారెడ్డి, ఉమమహేశ్వర్‌రెడ్డి రెండు గంటల పాటు వాదనలను సోమవారం వినిపించారు. పోలీసుల తరఫున స్పెషల్ పీపీ విజయమ్మ హాజరయ్యారు. రిటర్న్ ఆర్గ్యుమెంట్స్‌ను ఫైల్ చేసి తమ వాదనలను వినిపించేందుకు వాయిదా కోరారు. ఇరుపక్షాల వాదనలను విన్న ఇన్‌చార్జి న్యాయమూర్తి సుమ కేసు విచారణను బుధవారానికి వాయిదా వేశారు.

రిమాండ్ పొడిగింపు

కాకాణిపై పోలీసులు నమోదు చేసిన అక్రమ కేసులో జ్యుడీషియల్ రిమాండ్ గడువు సోమవారంతో ముగిసింది. జైలు అధికారులు వర్చువల్‌గా ఆయన్ను హాజరుపర్చారు. రిమాండ్‌లో ఈ నెల 23 వరకు ఉంచాల్సిందిగా ఉత్తర్వులను ఇన్‌చార్జి న్యాయమూర్తి సుమ జారీ చేశారు. ఆయన్ను తిరిగి కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పిటిషన్‌ను పోలీసులు దాఖలు చేశారు.

మాన్యువల్ కౌన్సెలింగ్‌కు డిమాండ్

నెల్లూరు (టౌన్): ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్‌నే నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక స్టీరింగ్ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు డీఈఓ కార్యాలయ ఎదుట రిలే దీక్షలను సోమవారం నిర్వహించిన అనంతరం పలువురు మాట్లాడారు. వెబ్ కౌన్సెలింగ్ ద్వారా అనేక సమస్యలొస్తున్నాయని, దీనిపై విద్యాశాఖ కమిషనర్ ఎవరి మాట వినడంలేదని ఆరోపించారు. ఉపాధ్యాయులను బెదిరింపులకు గురిచేసి ఆప్షన్లు పెట్టించడం సరైన పద్ధతి కాదని హితవు పలికారు. స్టీరింగ్ కమిటీ సభ్యులు పిచ్చిబాబు, అనిల్‌కుమార్, చలపతి శర్మ, నరసింహులు, హజరత్తయ్య, కృష్ణారెడ్డి, మధుసూదన్‌రావు, శివశంకర్‌రెడ్డి, పద్మజ, రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లా పీహెచ్‌డీ ఎంట్రన్స్‌లో ఐదో ర్యాంక్



సనాతన భారత్

నెల్లూరు (టౌన్): ఉస్మానియా వర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన లా పీహెచ్‌డీ ఎంట్రన్స్‌లో 76 మార్కులతో ఐదో ర్యాంక్‌ను నగరానికి చెందిన సనాతన భారత్ సాధించారు. లాకు సంబంధించిన నేషనల్ ఎలిజిబులిటీ టెస్ట్ (నెట్)లో 92 శాతం, ఏపీ, తెలంగాణ స్టేట్ ఎలిజిబులిటీ టెస్ట్‌లో అర్హత సాధించారు. జిల్లా కోర్టు, సుప్రీం కోర్టులో ప్రాక్టీస్ చేశారు. ప్రస్తుతం ఏఓఆర్ లా ప్రాక్టీస్ చేస్తున్నారు.

సోషల్ వెల్ఫేర్ సూపరింటెండెంట్ సరెండర్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయ సూపరింటెండెంట్ లూకాస్‌ను తాడేపల్లి డైరెక్టర్ కార్యాలయానికి సరెండర్ చేస్తూ ఉత్తర్వులను సోమవారం జారీ చేశారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఎదుర్కొంటున్న పలు ఆరోపణల నేపథ్యంలో ఈ ఉత్తర్వులు రావడం చర్చనీయాంశమైంది.

రైతులను నట్టేట ముంచిన ధాన్యం దళారి

మనుబోలు: మాయమాటలు చెప్పి అధిక ధరలకు ధాన్యం కొనుగోలు చేసిన ఓ దళారి ఆ తర్వాత పత్తాలేకుండాపోయారు. బాధితుల వివరాల మేరకు.. వెంకటాచలం మండలం పూడిపర్తికి చెందిన రామారావు, తాటిపర్తిపాళేనికి చెందిన పెంచలయ్య ఎక్కువ ధర చెల్లిస్తామని నమ్మబలికి సుమారు 600 పుట్ల ధాన్యాన్ని సేకరించారు. మండలంలోని చెర్లోపల్లి, జట్ల కొండూరు, మడమనూరుకు చెందిన పలువురి నుంచి ధాన్యం సేకరించారు. ఆపై వీరు ఆ ధాన్యాన్ని వెంకటాచలం మండలం ఎర్రగుంటకు చెందిన దళారి వేముల శీనయ్యకు విక్రయించారు. రైతులకు రూ.90 లక్షలకుపైగా నగదు రావాల్సి ఉండగా, కాలయాపన చేస్తూ వచ్చారు. 20 రోజులుగా అందుబాటులో లేకపోవడంతో మోసపోయామని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మోసాలు.. ఎగవేతలు

రూ.కోట్లల్లో వ్యాపారం.. వందల్లో చెల్లింపు

- రూ.200 దాటితే బిల్లు జారీ తప్పనిసరి
- అమలుకు నోచుకోని నిబంధన
- మొక్కుబడిగా రిటర్న్స్ దాఖలు
- జోరుగా జీరో వ్యాపారం
- రాబడి తగ్గుముఖం
- నెల్లూరు డివిజన్లో జీఎస్టీ వసూళ్లలో ఇదీ తంతు

జిల్లాలో ఇలా..

జీఎస్టీలోకి వచ్చే డీలర్లు - 26 వేలకు పైగా

కాంపోజిషన్ ట్యాక్స్ చెల్లింపుదారులు - 2400 మందికిపైగా

వ్యాపారుల స్వార్థం.. అధికారుల ఉదాసీన వైఖరి.. వెరసి జీఎస్టీ వసూళ్లలో భారీగా గండిపడుతోంది. వినియోగదారుల నుంచి ఈ మొత్తాన్ని వసూలు చేస్తున్నా, అది ప్రభుత్వానికి జమకావడంలేదు. జీరో వ్యాపారం జోరుగా సాగుతున్న తరుణంలో గత ఆర్థిక సంవత్సరంలో వసూళ్లు 25 శాతం పతనమయ్యాయంటే పరిస్థితి తీవ్రత ఏమిటో అర్థం చేసుకోవచ్చు. మరోవైపు ఈ వ్యవహారంలో లెక్కలు చెప్పేందుకు అధికారులు సుముఖత వ్యక్తం చేయకపోవడం గమనార్హం.



నర్తకి సెంటర్‌లోని జీఎస్టీ కార్యాలయం

నెల్లూరు (టౌన్): నెల్లూరు జీఎస్టీ డివిజన్ పరిధిలోని నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో జీరో వ్యాపారం జోరుగా సాగుతోంది. ఆయా రంగాల్లో కోట్లల్లో వ్యాపారం జరుగుతున్నా.. చెల్లించే జీఎస్టీ రూ.వందల్లోనే ఉంటోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కస్టమర్ల నుంచి క్రమం తప్పకుండా వసూలు చేసినా, ప్రభుత్వానికి మాత్రం పంగనామం పెడుతున్నారు. రూ.20 లక్షల్లోపు వ్యాపారం ఉంటే ఎలాంటి పన్ను చెల్లించనక్కర్లేదనే నిబంధనను బూచిగా చూపి ఎక్కువ మంది ఎగ్గొడుతున్నారు.

నిబంధనలు బేఖాతర్

వాస్తవానికి అమ్మకాలు రూ.200 దాటితే జీఎస్టీ నంబర్‌తో కూడిన బిల్లును ఇవ్వాలనే నిబంధన ఉన్నా, నెల్లూరు డివిజన్ పరిధిలో ఎక్కడా అమలు కావడం లేదు. జీఎస్టీకి సంబంధించిన రిటర్న్స్‌ను మూడు నెలలకోసారి వ్యాపారులు దాఖలు చేయాల్సి ఉన్నా, అదీ మొక్కుబడిగానే జరుగుతోంది. ఈ విషయం అధికారులకు తెలిసినా, మామూళ్లతో మిన్నకుండిపోతున్నారనే విమర్శలున్నాయి.

వసూళ్లు 25 శాతం పతనం

నెల్లూరు డివిజన్, జిల్లాకు సంబంధించిన జీఎస్టీ రాబడి తగ్గిందని తెలుస్తోంది. వాస్తవానికి దాదాపు రూ.1200 కోట్ల రెవెన్యూ రావాల్సి ఉండగా, 2024 – 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.900 కోట్లు దాటలేదని సమాచారం. ఈ లెక్కన వసూళ్లు 25 శాతానికిపైగా పతనమయ్యాయి. ఈ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌ైందని సమాచారం. అయితే టార్గెట్, సాధించిన లెక్కలపై జీఎస్టీ అధికారులను ప్రశ్నిస్తే, బయటకు చెప్పకూడదనే సమాధానమిస్తున్నారు.

ఎక్కువగా వసూలయ్యేది వీటి నుంచే..

నెల్లూరు డివిజన్లో మోటార్ వెహికల్స్ నుంచి రెవెన్యూ ఎక్కువగా వస్తుంది. ఆ తర్వాత వెజిటబుల్ అయిల్, పోర్టు ఆధారిత అంశాలు, పొగాకు, ఎర్త్ మూవింగ్ పరికరాలు, జ్యువెలర్స్, ఐరన్ అండ్ స్టీల్, ఎలక్ట్రానిక్స్, రెడీమేడ్ వస్త్రాలు, గ్రానైట్, హోటళ్లు, రియల్ ఎస్టేట్ తదితరాల నుంచి ఉంటుంది. అయితే ఎందులోనూ ఆశించిన స్థాయిలో రాబడి రాలేదు.

జిల్లాలో లెక్క ఇదీ..

- నెల్లూరు డివిజన్ పరిధిలో నెల్లూరు, ప్రకాశం జిల్లాలున్నాయి. జిల్లాలో నెల్లూరు – 1, 2, 3, కావలి.. ప్రకాశం జిల్లాలో ఒంగోలు
- 1, 2, మార్కాపురం సర్కిళ్లున్నాయి.
- డివిజన్ పరిధిలో 26 వేల మందికిపైగా డీలర్లు జీఎస్టీ పరిధిలోకి వస్తారు. ఏడాదికి రూ.1.5 కోట్ల ఆదాయమిచ్చే డీలర్లు 21 వేల మందికిపైగా ఉన్నారు. వీరంతా ప్రతి నెలా రిటర్న్స్‌ను దాఖలు చేయాల్సి ఉంటుంది.
- ఏడాదికి రూ.50 లక్షల్లోపు రాబడి వచ్చే వారిని కాంపోజిషన్ ట్యాక్స్ పేయర్స్‌గా పరిగణిస్తారు. డివిజన్ పరిధిలో వీరి సంఖ్య ఐదు వేలకుపైగా ఉంటుంది. వీరు ప్రతి మూడు నెలలకోసారి రిటర్న్స్‌ను దాఖలు చేయాలి.

రెవెన్యూ విషయాలు బయటకు చెప్పకూడదు

జీఎస్టీకి సంబంధించిన లక్ష్యాలు, సాధించిన అంశాలను బయటకు చెప్పకూడదు. ఎగవేతదారులపై ప్రత్యేక దృష్టి సారించాం. రిటర్న్స్‌ను ప్రతి ఒక్కరూ దాఖలు చేయాల్సి ఉంది. అలా వ్యవహరించకపోతే చర్యలు చేపడతాం. తనిఖీల్లో బయటపడితే చర్యలు చేపడతాం.

– రవీంద్రనాథ్‌రెడ్డి, జీఎస్టీ ఉప కమిషనర్



జీరో దందాకు అడ్డుకట్టేదీ..?

జీరో వ్యాపారం జోరుగా సాగుతోంది. వినియోగదారుడు రూ.200కుపైగా ఏ వస్తువును కొనుగోలు చేసినా, జీఎస్టీ నంబర్‌తో కూడిన బిల్లును దుకాణ యజమాని తప్పక ఇవ్వాల్సి ఉంటుంది. ఉదాహరణకు జిల్లాలోని అధిక శాతం హోటళ్లలో బిల్లులివ్వని పరిస్థితి నెలకొంది. నిజానికి సీజీఎస్టీ, ఎస్జీఎస్టీ కింద తొమ్మిది శాతం చొప్పున 18 శాతాన్ని బిల్లులో వేస్తారు. లక్షల్లో వ్యాపారం జరుగుతున్నా, వేలల్లోనే రిటర్న్స్‌ను దాఖలు చేస్తున్నారు. బిల్లుల్లేకుండానే చెన్నై, బెంగళూరు, తదితర రాష్ట్రాల నుంచి పెద్ద మొత్తంలో బంగారు నగలను తీసుకొస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. దీనికి జీఎస్టీని చెల్లించరు. ఈ విషయం అధికారులకు తెలిసినా, నెలవారీ మామూళ్లతో మిన్నకుండిపోతున్నారు. చిన్నస్థాయి అధికారి నుంచి ఉన్నతాధికారి వరకు ప్రతి నెలా ముట్టజెప్తున్నామని వ్యాపారులే చెప్తున్నారు. ఇలా వ్యాపారులు పెద్ద మొత్తంలో జీఎస్టీని ఎగ్గొట్టి ప్రభుత్వాదాయానికి భారీగా గండి కొడుతున్నారు.

అడవిలో అక్రమార్కుల రాచకం

బరితెగిస్తున్న ఇంటి దొంగలు

- గుట్టుచప్పుడు కాకుండా జామాయిల్ కర్ర అమ్మకం
- శకునాలపల్లి ఎఫ్బీఓ నిర్వాకం
- గుట్టురట్టు చేసిన వీఎస్సెస్ కమిటీ సభ్యులు

ఉదయగిరి: కంచె చేను మేసిన చందంగా మారింది అటవీ శాఖ తీరు. అందులోని ఉద్యోగులు గుట్టుచప్పుడు కాకుండా దోచేసి తమ జేబులు నింపుకొంటూ ప్రభుత్వ ఖజానాకు చిల్లు పెడుతున్నారు. ఉదయగిరి రేంజ్ పరిధిలో కొన్నేళ్లుగా ఈ తంతు సాగుతున్నా, పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఇదే అదునుగా ఇంటి దొంగలు చెలరేగిపోతున్నారు. అక్రమార్కులకు ఆ శాఖలో పనిచేసే అధికారుల అండదండలుండటంతో అవినీతి అడ్డూఅదుపులేకుండా సాగుతోంది. కొంతమంది వీఎస్సెస్ సభ్యులు ధైర్యం చేసి ఓ అధికారి అక్రమాల బాగోతాన్ని బయటపెట్టారు. దీన్ని తొక్కిపెట్టేందుకు యత్నించినా, అదే శాఖలో పనిచేసే మరో ఉద్యోగి రాజీకి అంగీకరించకపోవడంతో ఎట్టకేలకు విచారణ జరుపుతున్నారు.

జరగాల్సిందిలా..

ఉదయగిరి అటవీ రేంజ్ పరిధిలోని ఉదయగిరి వెస్ట్ బీట్‌లో గల శకునాలపల్లిలో 20 హెక్టార్లల్లో జామాయిల్‌ను వీఎస్సెస్ కమిటీ పర్యవేక్షణలో కొన్నేళ్ల క్రితం నాటారు. వీటిని కమిటీలు సంరక్షించసాగాయి. అయితే ఇటీవల మొక్కలు పెద్దవి కావడంతో కటింగ్‌కు వచ్చాయి. వేలం ద్వారా విక్రయించే ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. టన్నును రూ.8100కు కొనుగోలు చేసేందుకు ఒక సంస్థ ముందుకొచ్చింది. చెట్లు నరికి ఆ ధర లెక్కన విక్రయించి నగదును ఖజానాకు జమ చేస్తారు. నరకడం.. లారీల్లో లోడ్ చేయడం.. ఎన్ని టన్నులున్నాయనే వివరాల నమోదు.. వాటికి పర్మిట్ల జారీ.. అక్రమాలు జరగకుండా అన్ని జాగ్రత్తలను ఆ బీట్‌లో విధులు నిర్వర్తించే ఫారెస్ట్ ఆధికారి, ఎఫ్బీఓ పాటించాలి.

అక్రమాలకు పాల్పడిన ఎఫ్బీఓ

శకునాలపల్లి ఎఫ్బీఓ భానుతేజ గుట్టుచప్పుడు కాకుండా కొంతమేర జామాయిల్‌ను నరికించారు.



ఉదయగిరి అటవీ రేంజ్ కార్యాలయం

తనకు అనుకూలమైన వ్యక్తి ద్వారా రాత్రి వేళ ట్రాక్టర్ల ద్వారా దొంగచాటుగా తరలించి బద్వేల్ సమీపంలోని ఓ కంపెనీలో విక్రయించారు. విషయం తెలుసుకున్న వీఎస్సెస్ కమిటీ సభ్యులు సదరు ఎఫ్బీఓ నిర్వాకాన్ని ఫారెస్ట్ అధికారి చినవెంకటయ్యకు ఈ నెల నాలుగున తెలియజేశారు. దీంతో భానుతేజను సదరు అధికారి ప్రశ్నించగా, వాగ్వాదానికి దిగారు. ఈ ఘటన తన మెడకెక్కడ చుట్టుకుంటుందోననే భయంతో కొద్ది రోజుల్లో ఉద్యోగ విరమణ పొందనున్న సదరు ఫారెస్ట్ అధికారి విషయాన్ని రేంజర్ దృష్టికి తీసుకెళ్లారు.

కుదరని సంధి

ఈ క్రమంలో రాజీ కుదిర్చేందుకు ఆ శాఖలో పనిచేసే భానుతేజ అనుచరులు యత్నించారు. అయితే వ్యవహారం వీఎస్సెస్ సభ్యులకు తెలియడంతో, నేరుగా వారు డీఎఫ్ఓ, ఉన్నతాధిధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో విధిలేక దుత్తలూరు డీఆర్వోను విచారణాధికారిగా రేంజర్ నియమించారు. ఇందులో వాస్తవాలు వెలుగుచూశాయి. అయినా ఘటన తీవ్రతను తగ్గించి తూతూమంత్రంగా నివేదికను రూపొందించి ఉన్నతాధికారులకు పంపేందుకు యత్నిస్తున్నారని వీఎస్సెస్ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

కార్యాలయంలో విచారణ

వీఎస్సెస్ సభ్యులు, అక్రమాలకు పాల్పడిన తేజ, కర్రను ట్రాక్టర్ ద్వారా తరలించిన దేవమ్మ చెరువుకు చెందిన సుబ్బారాయుడ్ని స్థానిక అటవీ రేంజ్ కార్యాలయంలో రేంజర్ కుమార్‌రాజా సోమవారం విచారించారు. అక్రమాలు జరిగాయనే అంశాన్ని తేల్చి, వారి స్టేట్‌మెంట్లను రికార్డు చేశారు. గతంలోనూ రూ.లక్షల విలువజేసే అటవీ సంపద ఇంటి దొంగలే కొల్లగొట్టి సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలున్నాయి. ఈ విషయమై రేంజర్‌ను సాక్షి సంప్రదించగా, అక్రమాలు జరిగిన మాట వాస్తవమేనని, విచారణ నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని బదులిచ్చారు.



సాక్షి కార్యాలయం వద్ద కొవ్వొత్తుల ర్యాలీ

‘సాక్షి’పై రాజకీయ ప్రేరేపిత దాడులు

- నెల్లూరు యూనిట్ కార్యాలయం వద్ద టీడీపీ నేతల రభస
- లోపలికి చొచ్చుకొచ్చేందుకు యత్నం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: పత్రిక స్వేచ్ఛపై కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే సాక్షి పత్రిక, ఛానల్‌పై పగబట్టి రాజకీయ ప్రేరేపిత దాడులకు ఉసిగొల్పుతోంది. సాక్షి టీవీ డిబేట్‌లో అమరావతి రాజధానిపై సీనియర్ జర్నలిస్ట్ అనుచిత వ్యాఖ్యలు చేశారనే సాకు చూపి రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ మూకలు దాడులకు పాల్పడుతూ భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. నగరంలోని సాక్షి యూనిట్ కార్యాలయం వద్ద నిరసన ర్యాలీని నెల్లూరు నగర నియోజకవర్గ టీడీపీ మహిళా విభాగ నేతలు పలువురితో కలిసి సోమవారం నిర్వహించారు. పత్రిక ప్రతులను తగలబెట్టి.. ఓ దశలో కార్యాలయంలోకి చొచ్చుకెళ్లేందుకు యత్నించారు. ప్రధాన గేట్‌కు తాళాలేసినా, లోపలికెళ్లేందుకు విశ్వప్రయత్నాలు చేశారు. నెల్లూరు రూరల్ సీఐ వేణుగోపాల్ ఆధ్వర్యంలో బందోబస్తును నిర్వహించారు.

కొవ్వొత్తులతో నిరసన

రాష్ట్రవ్యాప్తంగా సాక్షి కార్యాలయాలపై దాడులను నిరసిస్తూ నెల్లూరు సాక్షి యూనిట్ ఉద్యోగులు కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు. ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేయడం దుర్మార్గపు చర్యగా అభివర్ణించారు.

చర్యలకు వినతి

నెల్లూరు(క్రైమ్): నగరంలోని సాక్షి కార్యాలయంలోకి చొచ్చుకెళ్లేందుకు యత్నించిన వారితో పాటు రాష్ట్రవ్యాప్తంగా సంస్థ ఆఫీసులపై దాడులు చేసిన వారిపై చర్యలు చేపట్టాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా సాక్షి జర్నలిస్టులు పోలీస్ అధికారులకు వినతిపత్రాలను సోమవారం అందజేశారు. నెల్లూరులో రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావుకు వినతిపత్రాన్ని సాక్షి బ్యూరో ఇన్‌చార్జ్ మస్తాన్‌రెడ్డి, బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాసరావు తదితరులు అందజేశారు. సిబ్బందికి రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.



న్యాయం జరగలేదంటూ మహిళ ఆత్మహత్యాయత్నం

ఆత్మకూరు: ఇంటి విషయమై సమీప బంధువులతో ఎనిమిది నెలలుగా గొడవ జరుగుతున్నా, పోలీస్ స్టేషన్లో తనకు న్యాయం దక్కలేదని.. సంగం సీఐ వేమారెడ్డి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన చేజర్ల మండలం ఆదూరుపల్లిలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. బాధితురాలి బంధువుల వివరాల మేరకు.. ఆదూరుపల్లిలోని సర్వే నంబర్ 590లో ఇంటి స్థలం, పట్టాను షరీఫాబీకి 2009లో ప్రభుత్వం అందజేసింది. అప్పటి నుంచి ఇంటి పన్నులు చెల్లిస్తూ, ఆమె తన పిల్లలతో కలిసి నివసిస్తున్నారు. రెండేళ్ల క్రితం ఆమె మృతి చెందగా, కుమార్తె జమీలా అదే ఇంట్లో ఉంటున్నారు. షరీఫాబీ చెల్లెలు మగ్బూల్‌కు సర్వే నంబర్ 490లో ఇచ్చిన పట్టాను 590గా ఫోర్జరీ చేసి ఆ స్థలం తనదంటూ కోర్టు నుంచి తాత్కాలిక ఇంజెక్షన్ ఆర్డర్‌ను పది నెలల క్రితం తెచ్చుకున్నారు. ఈ తరుణంలో జమీలా, కుటుంబసభ్యులు ఇంట్లో లేని సమయంలో సామగ్రిని బయటపడేసి ఆక్రమించేందుకు యత్నించారు. గమనించిన జమీలా కుమారుడు హర్షద్ ప్రశ్నించగా, అతనిపై దాడి చేసి గాయపర్చారు. దీనిపై చేజర్ల పోలీసులు, సీఐకి ఫిర్యాదు చేశారు. అయితే కొందరు టీడీపీ నేతల మాటలను సీఐ విని జమీలా ఇంటికి తాళాలేసి తన వద్దే ఉంచుకున్నారు. దీంతో ఎస్పీకి ఫిర్యాదు చేసి ఆయన సూచనల మేరకు చేజర్ల తహసీల్దార్‌కు అర్జీని బాధితురాలు అందజేశారు. విచారణ జరిపి పట్టా మేరకు ఆ ఇల్లు షరీఫాబీకే చెందిందని, ఆమె వారసురాలైన జమీలాకు అక్కడ నివసించే హక్కు ఉందంటూ ఎండార్స్‌మెంట్ ఇచ్చారు. ఈ విషయాలను ఎస్సై తిరుమలరావుకు బాధితురాలు తెలియజేశారు. దీంతో ఫోర్జరీపై మగ్బూల్, ఆమె కుటుంబసభ్యులపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ తరుణంలో బాధితులు తమ ఇంట్లోకి వెళ్తుండగా, సీఐ సూచనలతో మగ్బూల్ ఆమె బంధువులు దాడి చేసేందుకు వచ్చారు. దీంతో తమ కుటుంబానికి రక్షణ లేదనే మనస్తాపంతో సూపర్ వాస్మాల్ 33 మందును సేవిస్తూ సెల్ఫీ వీడియోలో అన్యాయాన్ని వివరించారు. కొద్దిసేపటి అనంతరం ఆమె కుమారుడు, బంధువులు వచ్చి వైద్యం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు తెలిపారు.



సూపర్‌వాస్మాల్ సేవించి అపస్మారక స్థితిలో జమీలా

అర్జీల వెల్లువ

- నెల్లూరులో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'
- అధికారుల దృష్టికి 383 వినతులు



ఈ చిత్రంలోని వ్యక్తి పేరు మొద్దు వెంకటేశ్వర్లు. బుచ్చిరెడ్డిపాళెం మండల వాసి. గత ప్రభుత్వంలో రూ.6,000 పెన్షన్ వచ్చేది. ఇప్పుడు పక్షవాతం వచ్చింది. ఆర్థిక పరిస్థితులు బాగోలేవని, పెన్షన్ పెంచి ఆదుకోవాలని అధికారులను కోరారు.



సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

నెల్లూరు రూరల్: సమస్యలు పరిష్కరించాలని ప్రజలు అధికారులకు విజ్ఞప్తి చేశారు. నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, డ్వామా పీడీ గంగా భవాని, హౌసింగ్ పీడీ వేణు గోపాల్, జిల్లా సర్వే అధికారి నాగశేఖర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 132, మున్సిపల్ శాఖవి 35, సర్వేవి 28, పంచాయతీరాజ్ శాఖవి 34, పోలీస్ శాఖవి 63, సివిల్ సప్లయ్స్‌వి 16, ఇతర శాఖలకు సంబంధించి 383 వినతులందాయి.

తండ్రిని మభ్యపెట్టి..

నాకు రావాల్సిన ఆస్తిని సోదరుడు రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. నా తల్లి చనిపోయాక నాన్న రెండో వివాహం చేసుకున్నారు. వారికి ఇద్దరు పిల్లలున్నారు. నాలుగు భాగాలుగా అగ్రిమెంట్ రాసుకున్నాం. నాకు తెలియకుండా సోదరుడు తండ్రిని మభ్యపెట్టి ఫోర్జరీ సంతకాలతో ఆస్తిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని ఆత్మకూరు మండలం మహిమలూరుకు చెందిన పోకూరు కార్తీక్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

పింఛన్‌ను పునరుద్ధరించాలి

ఆరోగ్య సమస్యలతో మూడు నెలలు హైదరాబాద్‌లో చికిత్స తీసుకున్నా. ఆ సమయంలో పెన్షన్ తీసుకోలేదు. దీంతో పింఛన్ ఇవ్వడం ఆపేశారు. మధుమేహ వ్యాధితో కాళ్లు, చెయ్యి తీసేశారు. పింఛన్‌ను పునరుద్ధరించి ఆదుకోవాలని బోగోలు మండలం జువ్వలదిన్నె నివాసి వదినాల నాగరాజు కోరారు.

వసతి గృహాన్ని పునఃప్రారంభించాలంటూ..

సర్వేపల్లి ప్రభుత్వ బాలుర హాస్టల్‌ను పునఃప్రారంభించాలని జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు శేషం సుదర్శన్ వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ హాస్టల్ మూసివేతపై జిల్లా ప్రజా సంఘాల నేతలతో సమావేశాన్ని త్వరలో ఏర్పాటు చేస్తామని తెలిపారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటు కోసం..

నెల్లూరు నగరంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నేతలు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ పేద, మధ్య తరగతి విద్యార్థుల కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు సునీల్, కార్యదర్శి షారుక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

ఏదో చేశారంతే..

- మొక్కుబడిగా షైనింగ్ స్టార్ అవార్డుల ప్రదానోత్సవం
- మంత్రులు, పలువురు ఎమ్మెల్యేల డుమ్మా
- 284 మంది పది, ఇంటర్ విద్యార్థులకు అవార్డులు
- తల్లిదండ్రులకు సన్మాన విషయం మరిచిన అధికారులు



అవార్డులు అందుకున్న విద్యార్థులతో అధికారులు, ప్రజాప్రతినిధులు

నెల్లూరు(టౌన్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన షైనింగ్ స్టార్స్ ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం సోమవారం జిల్లాలో మొక్కుబడిగా సాగింది. దీనికి మంత్రులతోపాటు పలువురు ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టారు. పదో తరగతి, ఇంటర్మీడియట్‌కు సంబంధించి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదుతోపాటు మెడల్, సర్టిఫికెట్‌ను అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. దీనికి జిల్లాకు చెందిన మంత్రులు, ఇన్‌చార్జి మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఆహ్వానం పంపారు. అయితే నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి మాత్రమే హాజరయ్యారు. ఇంకా నగర మేయర్ స్రవంతి వచ్చారు. కలెక్టర్ ఆనంద్ సెలవుపై వెళ్లడంతో ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించారు. మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, ఇంటూరి నాగేశ్వరరావు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలు డుమ్మా కొట్టారు. నియోజకవర్గ పరిధిలో కార్యక్రమం జరుగుతున్నా శ్రీధర్‌రెడ్డి హాజరుకాకపోవడం చర్చనీయాంశంగా మారింది. అదే విధంగా ప్రతిభ చూపిన విద్యార్థుల తల్లిదండ్రులను కూడా సన్మానించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే కొంతమందిని ఎంపిక చేసి కేవలం వారితో మాట్లాడించడానికి పరిమితమయ్యారు. జిల్లాలో 284 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. వీరిలో పదో తరగతికి సంబంధించి ప్రభుత్వ పాఠశాలల నుంచి 95 మంది, ప్రైవేట్ పాఠశాలల నుంచి 155 మంది, ఇంటర్‌కు సంబంధించి ప్రభుత్వ జూనియర్ కళాశాలల నుంచి ఆరుగురు, ప్రైవేట్ జూనియర్ కళాశాలల నుంచి 28 మందికి రూ.20 వేల చొప్పున నగదు, మెడల్, సర్టిఫికెట్లను ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందజేశారు.

ఉన్నత లక్ష్యాలు సాధించాలి

క్రమశిక్షణ, అంకితభావం, సంకల్పంతో విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఎంపీ వేమిరెడ్డి తెలిపారు. జిల్లాలోని భవిత కేంద్రాల్లో పదిలో ఉత్తమ మార్కులు సాధించిన అంధ విద్యార్థులకు వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా ఉన్నత విద్యకు తమవంతు సహకారం అందిస్తామన్నారు. ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ మాట్లాడుతూ ఒకటి నుంచి 10 వరకు విద్యార్థులకు రెండు వేల స్టూడెంట్ కిట్స్‌ను సిద్ధం చేశామన్నారు. పీఎంశ్రీ పథకం ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని 12 కేజీబీవీల్లో సుమారు 3,200 మంది బాలికలు విద్యనభ్యసిస్తున్నారని, 38 భవిత కేంద్రాల్లో దివ్యాంగ విద్యార్థులు చదువుకుంటున్నారన్నారు. ఈకార్యక్రమంలో డీఈఓ బాలాజీ రావు, సమగ్రశిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య, డీవీఈఓ మధుబాబు, ఆర్ఐఓ వరప్రసాదరావు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.30
నన్నవి	: రూ.20
పండ్లు	: రూ.10



నెల్లూరులో యోగాంధ్ర ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్

నెల్లూరు(బారకాసు): నగరంలోని ముత్తుకూరు సెంటర్ నుంచి చిల్డ్రన్స్ పార్క్ వరకు జిల్లా స్థాయి యోగా ర్యాలీని సోమవారం జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ కె.కార్తీక్ జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా అధికారులు, మెప్మా మహిళలు, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమాలను జిల్లాలోని చిట్టచివరి గ్రామానికి సైతం చేరేలా అందరూ కృషి చేయాలని సూచించారు. ర్యాలీలో కమిషనర్ నందన్, జెడ్పీ సీఈఓ విద్యారమ, వివిధ శాఖల అధికారులు వెంకటరమణ, విజయన్, గంగాధర్, గంగా భవాని, గురప్ప పాల్గొన్నారు. కాగా సోమవారం జిల్లా వ్యాప్తంగా అన్ని వార్డు, గ్రామ సచివాలయ పరిధిల్లో ర్యాలీలను నిర్వహించారు.

క్లుప్తంగా

పోలీస్‌స్టేషన్ ఎదుట వృద్ధురాలి నిరసన



స్టేషన్ వద్ద మస్తాన్‌బీ

ఇందుకూరుపేట: న్యాయం చేయాలని కోరుతూ మండలంలోని పాములపాళెం గ్రామస్తురాలు మస్తాన్‌బీ సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. కోడలు వహీదా తనపై దాడి చేయడంతోపాటు భయభ్రాంతులకు గురిచేస్తోందని శనివారం ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పోలీసులు ఆమెపై ఇప్పటి వరకు చర్యలు చేపట్టలేదని, తనకు న్యాయం చేయాలని కోరుతూ స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపింది. పోలీసులు న్యాయం చేస్తామని సర్ది చెప్పడంతో వెళ్లిపోయింది.

వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే..

- కూటమి ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోంది
- రాష్ట్ర మహిళా విభాగం జోనల్ అధ్యక్షురాలు గౌరి



మాట్లాడుతున్న గౌరి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ప్రభుత్వ వైఫల్యాలను, ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను కప్పిపుచ్చుకోవడానికి కూటమి ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం జోనల్ అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి అన్నారు. సోమవారం నెల్లూరులోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. ఓ జర్నలిస్ట్ చేసిన వ్యాఖ్యలను వైఎస్సార్‌సీపీ, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆపాదించి, పాలనా వైఫల్యాల నుంచి తప్పించుకోవడానికి కూటమి ప్రభుత్వం వేసిన ఎత్తుగడను ప్రజలు గమనిస్తున్నారన్నారు. మహిళలను గౌరవించడం, మహిళా సాధికారత కోసం అనుక్షణం తపించే నాయకుడు జగన్ అని చెప్పారు. ఆయన పాలనలో వారి కోసం ప్రత్యేకంగా పథకాలు అమలు చేశారన్నారు. 32 లక్షల మంది మహిళల పేరుపై ఇళ్ల పట్టాలు ఇచ్చారన్నారు. రక్షణ కోసం దిశ యాప్‌ను తీసుకొచ్చి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. మహిళల రక్షణ కల్పించడంలో విఫలమైన రాష్ట్ర హోంమంత్రి ప్రజలకు క్షమాపణలు చెప్పాలన్నారు. సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్ట్ చేయడం బాధాకరమన్నారు. తన్మయి హత్య ఘటనకు ముఖ్యమంత్రి, ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు.

స్వగ్రామానికి వెళ్తూ..

- రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



హజరత్తయ్య (ఫైల్)

కలిగిరి: మండలంలోని బిమ్మరాజుచెరువు – నాగిరెడ్డిపాళెం మధ్య జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో పోలంపాడు గ్రామానికి చెందిన దామంచర్ల హజరత్తయ్య (50) మృతిచెందాడు. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యుల కథనం మేరకు.. పోలంపాడు గ్రామానికి చెందిన హజరత్తయ్య ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. అతడికి భార్య, కుమార్తె ఉన్నారు. అత్తగారి ఊరైన వింజమూరు మండలం రావిపాడుకు ఆదివారం వెళ్లాడు. తిరిగి రాత్రి భార్య అరుణతో మోటార్‌బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. ఈ క్రమంలో ఆగి ఉన్న బైక్‌ను ప్రమాదవశాత్తు ఢీకొనగా భార్యాభర్తలు రోడ్డుపై పడిపోయారు. హజరత్తయ్య తీవ్రంగా, అరుణ స్వల్పంగా గాయపడ్డారు. వారిని కలిగిరిలోని ప్రైవేట్ వైద్యశాలకు తీసుకెళ్లారు. పరిస్థితి విషయంగా ఉండటంతో హజరత్తయ్యను నెల్లూరుకు తరలించారు. ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. కలిగిరి పోలీసులు కేసు నమోదు చేశారు.

కలిగిరిలో ప్రేమజంటపై దాడి

- యువకుడికి గాయాలు



గాయపడిన సాయి

కలిగిరి: మండలంలోని కలిగిరిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ప్రేమజంటపై యువతి బంధువులు దాడి చేశారు. సోమవారం జరిగిన ఈ ఘటనలో యువకుడు గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. నెల్లూరుకు చెందిన సాయి, పూజిత వీఆర్ లా కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. వీరు కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. కులాలు వేరు కావడంతో యువతి కుటుంబ సభ్యులు పెళ్లికి నిరాకరించారు. యువతికి వేరే వ్యక్తితో వివాహం చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సాయి, పూజిత స్నేహితుల సహకారంతో బైరవకోనకు వెళ్లి వివాహం చేసుకున్నారు. తిరిగి నెల్లూరుకు కారులో బయలుదేరారు. కలిగిరిలో టీ తాగేందుకు ఆగారు. వారిని మోటార్‌బైక్‌లపై యువతి బంధువులు వెంబడించారు. ఈ క్రమంలో పూజితను తీసుకెళ్లడానికి ప్రయత్నించారు. సాయి అడ్డుకోవడంతో వారు దాడి చేసి గాయపరిచారు. హైస్కూల్లో క్రికెట్ ఆడుతున్న యువకులు, స్థానికులు అడ్డుకోవడంతో వెళ్లిపోయారు. పోలీసులు ప్రేమజంటను స్టేషన్‌కు తీసుకెళ్లి మాట్లాడారు.

ఆత్మకూరు ఈఈగా భానూనాయక్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఆత్మకూరు విద్యుత్ శాఖ ఈఈగా ఎం.భానూనాయక్‌ను నియమిస్తూ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన ప్రస్తుతం విజయవాడలో పనిచేస్తున్నారు. ఆత్మకూరు ఈఈ శ్రీనివాసులు ఇటీవల సత్యసాయి జిల్లాకు బదిలీ అయ్యారు.

గంజాయి విక్రయిస్తుండగా..

- ముగ్గురు వ్యక్తుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు

నెల్లూరు(క్రైమ్): గంజాయిని విక్రయించేందుకు కారులో సిద్ధంగా ఉన్న ముగ్గురు నిందితులను నెల్లూరు వేదాయపాళెం పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం వేదాయపాళెం పోలీస్‌స్టేషన్‌లో స్థానిక ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు నిందితుల వివరాలను వెల్లడించారు. ఆదివారం సాయంత్రం తల్పగిరి కాలనీలోని సాయిబాబా మందిరం సమీపంలో గంజాయి విక్రయాలు సాగుతున్నాయని ఇన్‌స్పెక్టర్‌కు పక్కా సమాచారం అందింది. ఆయన తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని కారులో గంజాయిని విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న తిరుపతి జిల్లా నాయుడుపేట మండలం కానూరు రాజుపాళేనికి చెందిన ఈ.సాయికిరణ్, నెల్లూరు నవాబుపేట రామచంద్రాపురానికి చెందిన దిలీప్, తిరుపతి జిల్లా వెంకటగిరి నెహ్రూనగర్‌కు చెందిన జనార్దన్‌ను అరెస్ట్ చేశారు. 400 గ్రాముల గంజాయి, కారును స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

విద్యుదాఘాతానికి గురై..

- వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

మనుబోలు: విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని మడమనూరు గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కొణితం మస్తానయ్య (40) ఆదివారం అర్ధరాత్రి నిద్రలేచి మూత్రవిసర్జన కోసం ఆరుబయటకు వెళ్లాడు. అప్పటికే గాలికి అక్కడ కరెంట్ తీగ తెగిపడి ఉంది. దీనిని మస్తానయ్య గమనించలేదు. దీంతో విద్యుత్ తీగ కాలికి తగిలి షాక్‌కు గురై కుప్పకూలి చనిపోయాడు. సమాచారం అందుకున్న ఎస్సై శివరాకేష్ సోమవారం మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

కాలువలో పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి



నెల్లూరు(క్రైమ్): నెల్లూరు బృందావనంలోని యూనియన్ బ్యాంక్ సమీపంలో ఉన్న కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెంది ఉండటాన్ని సోమవారం స్థానికులు గుర్తించి సంతపేట పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై బాలకృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో మృతదేహాన్ని వెలికితీసి జీజీహెచ్ మార్చురీకి తరలించారు. 46వ డివిజన్ వీఆర్వో శివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతుడి వివరాలు తెలిసిన వారు సంతపేట పోలీస్‌స్టేషన్, 94407 00017 నంబర్‌కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

జెడ్పీ సీఈఓ బదిలీ

నెల్లూరు(పొగతోట): జిల్లా పరిషత్ సీఈఓ విద్యారమ బదిలీ అయ్యారు. శ్రీకాళహస్తిలోని శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్‌గా నియమితులయ్యారు. బుచ్చిరెడ్డిపాళెం ఎంపీడీఓ శ్రీహరి వెస్ట్ గోదావరి సీఈఓగా బదిలీ అయ్యారు.